క్లుప్తంగా

దోమల నిర్మూలనకు ప్రత్యేక డ్రైవ్



కంకిపాడు: దోమల నిర్మూలనకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు మలేరియా సబ్‌యూనిట్ అధికారి జి.శ్రీనివాసరావు పేర్కొన్నారు. వైద్య ఆరోగ్య శాఖ, పంచాయతీ సంయుక్త ఆధ్వర్యంలో ఉప్పలూరు గ్రామంలో దోమల నిర్మూలన చర్యలు సోమవారం చేపట్టారు. శ్రీనివాసరావు మాట్లాడుతూ దోమల నిర్మూలనకు అబెట్ ద్రావణాన్ని డ్రెయినేజీలు, నీరునిల్వ ఉండే ప్రాంతాల్లో పిచికారీ చేస్తున్నామన్నారు. దోమల వ్యాప్తిని అడ్డుకోవటం ద్వారానే వ్యాధులు అరికట్టవచ్చని చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ లాం సోనియా, పంచాయతీ కార్యదర్శి బి.వెంకటేశ్వరరావు, ఎంపీహెచ్‌ఈఓ కృష్ణారావు, హెల్త్ అసిస్టెంట్ రాచమళ్ల శ్యాంప్రసాద్, లాం సురేష్ తదితరులు పాల్గొన్నారు.

230 మందికి కంటి వైద్య పరీక్షలు



కంకిపాడు: కంకిపాడు పట్టణంలోని మసీదు సెంటరులో సోమవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. మసీదు అధ్యక్షుడు సయ్యద్ కాలేషావలీ ఆధ్వర్యంలో విజయవాడ మాక్సివిజన్ సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రి పర్యవేక్షణలో శిబిరం ఏర్పాటుచేశారు. 230 మంది రోగులకు కంటి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. కంటి సంరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సిబ్బంది అవగాహన కల్పించారు.

యనమలకుదురు దేవస్థానంలో ప్రత్యేక పూజలు



పెనమలూరు: యనమలకుదురు గ్రామంలో వేం చేసి ఉన్న శ్రీపార్వతీ సమేత శ్రీరామలింగేశ్వర స్వామివారి దేవస్థానంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో ఉదయం 6.30 గంటలకు, 8.00, 9.30 గంటలకు స్వామి వారికి అభిషేకం చేశారు. 10.30 గంటలకు ఏకాదశ రుద్రాభిషేకం చేశారు. సాయంత్రం స్వామివారికి పంచహారతులు, స్వామివారికి పల్లకీసేవ నిర్వహించారు. భక్తులు స్వామివారికి దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. శ్రీరామలింగేశ్వర చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో భక్తులకు ఉచిత ప్రసాదాలు పంపిణీ చేశారు. ఆలయ నిర్మాణదాత సంగా నరసింహారావు, ప్రధాన అర్చకుడు జీఆర్‌వీ సాగర్, ఈవో ఎన్.భవాని పర్యవేక్షించారు.

కంకిపాడు పీఏసీఎస్ చైర్మన్‌గా శివ ప్రమాణస్వీకారం



కంకిపాడు: కంకిపాడు పీఏసీఎస్ నూతన చైర్మన్‌గా సుంకర శివ సోమవారం ప్రమాణస్వీకారం చేశారు. స్థానిక కేడీసీసీ బ్యాంకు ఆవరణలోని సొసైటీ కార్యాలయంలో జరిగిన ప్రమాణస్వీకారంలో శివతో పాటుగా మరో ఇద్దరు డైరెక్టర్లు బాధ్యతలు చేపట్టారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే బోడె ప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. నూతన చైర్మన్ శివ మాట్లాడుతూ రైతులకు మెరుగైన సేవలు అందేలా కృషి చేస్తానన్నారు. ఎంపీపీ రాజ్యలక్ష్మి, సర్పంచ్ బాకీ రమణ, సీహెచ్‌సీ చైర్మన్ బోయిన రోహిణికుమారి, జనసేన నాయకులు మండలి రాజేష్, ముప్పా రాజా పాల్గొన్నారు.

పారిశుద్ధ్య నిర్వహణలో నిర్లక్ష్యం వద్దు

పటమట(విజయవాడతూర్పు): నగరంలో పారిశుద్ధ్య నిర్వహణలో నిర్లక్ష్యం వద్దని వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. నగర పర్యటనలో భాగంగా ఆయన సోమవారం ఎంజీ రోడ్డు, బెంజ్ సర్కిల్ నేషనల్ హైవే సర్వీస్ రోడ్, డెంటల్ కాలేజ్ రోడ్డు, ఈఎస్‌ఐ రోడ్, భగత్‌సింగ్ రోడ్, సీఆర్ ఫ్లైఓవర్, బీఆర్టీఎస్ రోడ్, నూజివీడు రోడ్, గణపతిరావు రోడ్, పిన్నమనేని పాలీ క్లినిక్ రోడ్, పంజా సెంటర్, గులాబీ తోటలో పర్యటించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పారిశుద్ధ్య నిర్వహణలో అధికారులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని, ఎక్కడా సమస్యలు తలెత్తకుండా చూసుకోవాలన్నారు. సైడ్ డ్రైన్లలో వ్యర్థాలు పేరుకోకుండా నిరంతరం డీసిల్టు పనులు చేయాలని, టౌన్ ప్లానింగ్ సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ ఎప్పటికప్పుడు అనధికార ఫ్లెక్సీలు తొలగించాలని, నిర్మాణ వ్యర్థాలు రోడ్డు వెంట ఉండకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం ఆయన పిన్నమనేని పాలీక్లినిక్ రోడ్డులో జరుగుతున్న డ్రైన్ పనులను పరిశీలించారు.

తూతూమంత్రంగా కేంద్ర బృందం పర్యటన

ఉయ్యూరురూరల్: మండలంలోని పెద ఓగిరాలలో కేంద్ర బృందం పర్యటన సోమవారం తూతూమంత్రంగా సాగింది. ఈ పర్యటన గ్రామ సచివాలయానికి పరిమితం కావడంతో పలు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కేంద్ర ప్రభుత్వంలో చేస్తున్నావ్ వివిధ పథకాలు అభివృద్ధికి కేటాయించిన నిధులు సక్రమంగా అందుతున్నాయా లేదా అనే అంశాలను నిశితంగా పరిశీలించేందుకు కేంద్ర బృందం ప్రతినిధులు హడావిడిగా పర్యటించారు. పర్యటనలో కేవలం సచివాలయంలోని ఉపాధి హామీ పథకం పనితీరు స్వయం సహాయక సంఘాల అభివృద్ధి, సీసీ రోడ్ల నిర్మాణం, ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం అమలు తీరుపై రికార్డులను పరిశీలించి ఆయా అధికార యంత్రం నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. నిబంధన ప్రకారం బృందం ప్రతినిధులు గ్రామంలో జరిగిన వివిధ అభివృద్ధి పనులను నిశితంగా పరిశీలించేందుకు గ్రామ పర్యటన నిర్వహించాలి. ఈ క్రమంలో స్థానికుల నుంచి వివరాలు సేకరించి అనంతరం అధికార యంత్రాంగం సమీక్ష చేయాలి. అందుకు విరుద్ధంగా ఆయా శాఖల అధికారులు సిబ్బంది ముందస్తుగా ప్రిపేర్ చేసిన లబ్ధిదారులను సచివాలయానికి రప్పించి వారితో మాత్రమే బృందం ప్రతినిధులతో మాట్లాడించారు. దీంతో కేంద్ర బృందం పర్యటన నామమాత్రంగానే సాగిందని అభివృద్ధి పనులను ఏ ఒక్కటి పరిశీలించిన దాఖలాలు లేవని స్థానికులు గుసగుసలాడుకోవడం మారింది. గ్రామాల అభివృద్ధి దేశ అభివృద్ధిని నిత్యం బోధన చేసే ప్రజాప్రతినిధులు ఉన్నతాధికారులు అందుకు విరుద్ధంగా అధికారులతో మాత్రమే నామమాత్రపు సమీక్ష నిర్వహించి మమ అనిపించారు.



ఉపాధి హామీ పథకం అధికారులతో మాట్లాడుతున్న కేంద్ర బృందం ప్రతినిధులు

అంతా ఆ అధికారి దే...

కేంద్ర బృందం పర్యటనకు లైసెనింగ్ ఆఫీసర్‌గా స్థానికులతో లబ్ధిదారులతో అధికారులతో మాట్లాడించేందుకు జిల్లా డీఆర్డీఏ పీడీ వ్యవహరించారు. పర్యటనలో బృందానికి బదులు ఆయనే అంతా చక్కబెట్టి సరి చేయడం విస్మయానికి గురిచేసింది. వాస్తవానికి పర్యటన బృందం పరిశీలించేందుకు వచ్చింది ప్రధానమైన శాఖలు ఉపాధి హామీ పథకం స్వయం సహాయక సంఘాలు, ప్రధానమంత్రి ఆవాస్ యోజన సీసీ రోడ్ల నిర్మాణం ఈ శాఖలన్నీ డీఆర్డీఏ పరిధిలో ఉన్నవి ఆ శాఖకు జిల్లా ఉన్నతాధికారిగా వ్యవహరిస్తున్న అధికారినే లైసెనింగ్ ఆఫీసర్‌గా నియమించడం వెనుక కేంద్ర బృందం పర్యటన తీరును బట్టబయలు చేస్తోంది. వాస్తవ విషయాలను బయటకు చెప్పకుండా దాచేందుకు బృందం పర్యటనకు డీఆర్డీఏ పీడీ సంధాన కర్తగా వ్యవహరించడం జరిగిందని స్పష్టమవుతుంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు పరిశీలన చేసి కేంద్ర బృందం ప్రతినిధుల పర్యటనలకు, సమర్థత ఉన్న అధికారులను సంధానకర్తలుగా నియమించాలని స్థానికులు, ఇతర శాఖల సిబ్బంది అభిప్రాయపడుతున్నారు. ఈ అధికారి నియామకంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంక్షేమ పాలన, సుపరిపాలన తొలి అడుగులో ఉన్న గుట్టును రట్టు చేసిందనే విమర్శలున్నాయి.

అనధికార కట్టడంపై చర్యలు చేపట్టి నిలిపివేత

పెనమలూరు: తాడిగడప మున్సిపాలిటీలో టౌన్ ప్లానింగ్ అధికారుల రూటే వేరుగా ఉంది. టౌన్‌ప్లానింగ్ అధికారులపై అనేక ఆరోపణలు వస్తున్నా నిమ్మకు నీరెత్తినట్లుగా ఉన్నారు. తాడిగడప డొంక రోడ్డులో అనధికార కట్టడంపై సోమవారం టౌన్‌ప్లానింగ్ అధికారులు చర్యలకు రంగంలోకి దిగి అర్ధంతరంగా వెనుదిరిగారు. తాడిగడప డొంక రోడ్డులో చోటా బిల్డర్ నిబంధనలకు విరుద్ధంగా అనధికార కట్టడం కట్టసాగాడు. తొలిదశలోనే టౌన్ ప్లానింగ్ అధికారులు చర్యలు తీసుకోలేదు. అయితే హడావుడిగా ఇప్పుడు రంగంలోకి దిగి చర్యలు చేపట్టారు. భవనం శ్లాబ్‌కు రంధ్రాలు పెట్టడం మొదలు పెట్టారు. ఈ లోగా ఏమి జరిగిందో తెలియదుకాని సిబ్బంది వెంటనే వెనుదిరిగారు. డీల్ సెట్ అయిందో లేక పై నుంచి ఒత్తిడి వచ్చిందో అనధికార నిర్మాణాన్ని వదిలేసి వెళ్లారు. తాడిగడప మున్సిపాలిటీలో టౌన్ ప్లానింగ్ వ్యవహారం నానాటికీ వివాదస్పదంగా మారుతుంది. నిఘా విభాగాలు తాడిగడప మున్సిపాలిటీలో జరుగుతున్న తంతుపై కన్నేసి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



తాడిగడప డొంక రోడ్డులో శ్లాబ్ పగులకొడుతున్న టౌన్ ప్లానింగ్ సిబ్బంది

విద్యా రంగాన్ని కాపాడుకునేందుకు కృషి

గన్నవరం: ప్రభుత్వ విద్యా రంగాన్ని కాపాడుకునేందుకు ఉపాధ్యాయులందరూ సమష్టిగా కృషి చేయాలని యూటీఎఫ్ జిల్లా కోశాధికారి మరీదు వరప్రసాద్ పిలుపునిచ్చారు. గన్నవరంలోని పలు ప్రభుత్వ పాఠశాలలో సోమవారం యూటీఎఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మరీదు మాట్లాడుతూ.. విద్యా రంగ సమస్యలపై యూటీఎఫ్ నిరంతరం పోరాటాలు చేస్తోందన్నారు. ప్రస్తుత పాలకులు అందరికీ విద్యను అందించే బాధ్యతల నుంచి క్రమంగా తప్పుకుంటుందని చెప్పారు. ప్రైవేటీకరణ, కార్పొరేటీకరణ సంస్కరణలను వేగవంతంగా అమలు చేస్తుందని ఆరోపించారు. వీటికి వ్యతిరేకంగా ఉద్యమించేందుకు ఉపాధ్యాయులందరూ కలిసి రావాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న డీఏలను వెంటనే విడుదల చేయాలని, పీఆర్సీని ప్రకటించాలని, ప్రభుత్వ పాఠశాలలోని సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. యూటీఎఫ్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జీవీ రవిబాబు, జీ రాజబాబు, సంఘ నేతలు శ్రీనివాస్, నవభారతి, జ్ఞానానందం, రత్నకుమారి తదితరులు పాల్గొన్నారు.



సభ్యత్వ నమోదు పత్రాలు అందజేస్తున్న యూటీఎఫ్ నేతలు

గన్నవరం - ముదిరాజుపాలెం బస్ సర్వీస్ ప్రారంభం

గన్నవరం: విద్యార్థులు, ప్రయాణికుల సౌకర్యార్థం గన్నవరం నుంచి ముదిరాజుపాలెం గ్రామానికి ఉదయం, సాయంత్రం బస్ సర్వీస్‌లను ప్రారంభించినట్లు డిపో మేనేజర్ పి.శివాజీ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ బస్సు ప్రతి రోజు ఉదయం 7.30కు గన్నవరం నుంచి బయలుదేరి 8 గంటలకు ముదిరాజుపాలెం చేరుకుంటుందన్నారు. తిరిగి ఆ గ్రామం నుంచి 8.10కు బయలుదేరి 8.40 గంటలకు గన్నవరం వస్తుందన్నారు. తిరిగి సాయంత్రం 5.30కు గన్నవరం నుంచి బయలుదేరి 6 గంటలకు ముదిరాజుపాలెం చేరుకుని, అక్కడి నుండి 6.10కు బయలుదేరి 6.40కు గన్నవరం చేరుకుంటుందని చెప్పారు. ఈ బస్ సర్వీస్‌లను ముదిరాజుపాలెం, కట్టుబడిపాలెం, గోపవరపుగూడెం, కొండపావులూరు, పురుషోత్తపట్నం ప్రాంత వాసులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.



ముదిరాజుపాలెం వెళ్లే బస్సు

వృద్ధురాలి హత్య.. తెలిసిన వారి పనేనా?

- మంతెన హత్య కేసులో విచారణ ముమ్మరం
- మూడు బృందాలుగా ఏర్పడి విచారణ
- ఇంటిలో పనిచేసిన కూలీలను విచారించిన పోలీసులు

కంకిపాడు: వృద్ధురాలి దారుణ హత్య తెలిసిన వారి పనేనా? అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. వృద్ధురాలి హత్య నేపథ్యంలో పోలీసులు వివిధ కోణాల్లో దర్యాప్తు సాగిస్తున్నారు. ప్రాథమిక విచారణలో ఆ కుటుంబం గురించి బాగా తెలిసిన వారే ఈ ఘాతుకానికి ఒడిగట్టి ఉంటారన్న ప్రాథమిక అంచనాకు పోలీసులు వచ్చినట్లు తెలుస్తోంది.

వివరాల్లోకి వెళితే..

మండలంలోని మంతెన గ్రామానికి చెందిన తిరుమల స్వర్ణకుమారి(70) ఈనెల 13న దారుణ హత్యకు గురైంది. స్వర్ణకుమారి ఇంట్లో ఒంటరిగా ఉన్న సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు ఇంట్లోకి ప్రవేశించి వైరు సాయంతో గొంతు నులిమి చంపి ఆ తరువాత ఎడమ చేతి మణికట్టును కోసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో స్వర్ణకుమారి మెడలో ఉన్న రెండు కాసుల నానుతాడు చోరీ చేసి ఘటనాస్థలం నుంచి ఉడాయించారు.

మూడు బృందాలు ఏర్పాటు

హత్య నేపథ్యంలో పోలీసులు విచారణ ప్రారంభించారు. క్లూస్‌టీం, ఫోరెన్సిక్ నిపుణులు, డాగ్ స్క్వాడ్ బృందాలు ద్వారా సేకరించిన ప్రాథమిక సమాచారంతో విచారణ చేపట్టారు. కంకిపాడు ఎస్‌ఐ డి.సందీప్, అదనపు ఎస్‌ఐ తాతాచార్యులు, ఉయ్యూరు రూరల్ ఎస్‌ఐ సురేష్‌ల నేతృత్వంలో మూడు ప్రత్యేక బృందాలను విచారణకు ఏర్పాటు చేశారు. ఈ బృందాలు సెల్ ఫోన్ సిగ్నల్స్, సీసీ కెమేరాల పుటేజీలు, గ్రామంలో ఈ కుటుంబానికి ఉన్న సంబంధాలు, వ్యతిరేక వర్గాలపైనా వివరాలు సేకరిస్తున్నారు. అయితే అందరితో కలివిడిగా ఉండే కుటుంబంలో ఈ దారుణం జరగటాన్ని స్థానికులు జీర్ణించుకోలేకపోతున్నారు.



ఘటనా స్థలంలో స్వర్ణకుమారి మృతదేహం(ఫైల్)

కూలీల విచారణ..

గత 10 రోజులకు పైగా స్వర్ణకుమారి నివాసంలో తాపీ, పెయింటింగ్, టైల్స్ పనులు జరుగుతున్నాయి. కూలీల్లో బిహార్‌కు సంబంధించిన ముఠా కూడా ఉన్నట్లు తెలుస్తోంది. కూలీ పనులకు వచ్చిన వారిలో ఎవరైనా చెడు ప్రవర్తన కలిగి ఉన్నారా?, వారి హస్తం ఉందా? అన్న కోణంలో ప్రాథమికంగా దర్యాప్తు సాగిస్తున్నారు. సోమవారం పలువురు కూలీలను పోలీసుస్టేషన్‌కు పిలిపించి విచారణ కూడా జరిపినట్లు సమాచారం. మరో వైపు హత్యకు ఒకరే పాల్పడ్డారా? లేక ఎందరి ప్రమేయం ఉంది? అన్న వివరాలనూ సేకరించే పనిలో పడ్డారు. స్వర్ణకుమారి కుటుంబం గురించి బాగా తెలిసిన వ్యక్తి ఈ దారుణానికి ఒడిగట్టి ఉండొచ్చని విశ్వసనీయ సమాచారం. ఆ గ్రామానికి చెందిన వ్యక్తే ఇందులో భాగస్వామిగా ఉన్నాడని, సమీపంలోని ఉప్పలూరు గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తుల సహకారం కూడా తీసుకున్నట్లు గ్రామంలో ప్రచారం జరుగుతోంది. డబ్బు, నగదు కోసమే దారుణానికి ఒడిగట్టారని, అయితే మృతురాలి భర్త వెంకట కోటేశ్వరరావు ఇంటికి వచ్చే సమయం అవుతుండటంతో హడావిడిగా పరారయ్యారని తెలుస్తోంది.

25 నుంచి శ్రావణ మాస పూజలు

రామవరప్పాడు: విజయవాడ రూరల్ మండలం రామవరప్పాడు శ్రీ వెంకమ్మ పేరంటాలమ్మ ఆలయంలో ఈనెల 25 నుంచి ఆగస్టు 23వ తేదీ వరకు శ్రావణమాస విశేష పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి పి.ప్రియాంక తెలిపారు. సోమవారం ప్రియాంక మాట్లాడుతూ శ్రావణ మాసం సందర్భంగా ఆలయంలో అమ్మవార్లకు ప్రత్యేక పూజలతో పాటు గోత్ర నామాలతో నెల రోజుల పాటు పూజలు జరుగుతాయన్నారు. ప్రత్యక్షంగా పాల్గొనలేని భక్తులకు పరోక్షంగా కూడా పూజలు నిర్వహించనున్నట్లు తెలిపారు. మాసంతరమున అమ్మవారి ప్రత్యేక ప్రసాదం, కుంకుమ, అక్షింతలు ఆలయానికి వచ్చి తీసుకోవాలని సూచించారు. స్వయంగా రాలేని భక్తులకు పోస్టు, కొరియర్ ద్వారా అందజేస్తామన్నారు. పూజా కార్యక్రమాల్లో భక్తులు విశేషంగా పాల్గొనాలని కోరారు.

వినాయక హోమం.. సర్వశ్రేయోదాయకం

విజయవాడకల్చరల్: గణేష వ్రతం సర్వ శ్రేయోదాయకమని కంచి కామకోటిపీఠం శారదా చంద్రమౌళీశ్వర, శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయ కార్యనిర్వాహకుడు డాక్టర్ ఆర్.నరావు అన్నారు. లబ్బీపేట శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయంలో సోమవారం సంకటహర చతుర్థి సందర్భంగా గణేష హోమం నిర్వహించారు. రామ్మోనరావు మాట్లాడుతూ సంకటహరచతుర్థినాడు హోమం చేస్తే సకల సుభాలు కలుగుతాయన్నారు. మేనేజర్ శర్మ పాల్గొన్నారు.

ఎన్నికల విధులపై బీఎల్‌ఓలకు శిక్షణ



ఉయ్యూరు: ఎన్నికల విధులు పట్ల బీఎల్‌ఓలు పూర్తి అవగాహన కలిగి ఉండాలని ఉయ్యూరు ఆర్డీఓ హెలా షారోన్ అన్నారు. పట్టణంలోని జిల్లా పరిషత్ పాఠశాల ఆవరణలో పెనమలూరు నియోజకవర్గ స్థాయి బీఎల్‌ఓల శిక్షణ తరగతులు సోమవారం నిర్వహించారు. ఆర్డీఓ మాట్లాడుతూ బీఎల్‌ఓలు ఎన్నికల విధులను సమర్థంగా నిర్వహించాలన్నారు. ఓటర్ల జాబితా తయారీ, తప్పులు సవరణ, కొత్త ఓట్ల చేర్పులు, మార్పులు, పోలింగ్ కేంద్రాల్లో విధులు నిర్వహణ వంటి అంశాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని చెప్పారు. ఒకే కుటుంబంలోని ఓటర్లు ఒకే పోలింగ్ కేంద్రంలో ఓటు హక్కు వినియోగించుకునేలా ఓటర్ల జాబితా తయారీ ఉండాలని ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సురేష్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

20 నుంచి 'సప్తదర్శిని' ఆర్టీసీ సర్వీసులు

ఆటోనగర్(విజయవాడతూర్పు): సప్తదర్శినికి ఆర్టీసీ సూపర్ లగ్జరీ నాన్‌ఏసీ పుష్‌బ్యాక్ బస్సులను ఈ నెల 20 నుంచి భక్తుల సౌకర్యార్థం నడుపుతున్నట్టు ఆటోనగర్ ఆర్టీసీ డిపో డీఎం కె.ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ఆటోనగర్ బస్‌స్టాండ్‌లో వేకువజామున 5.30 గంటలకు బయలుదేరి, పీఎన్‌బీఎస్ స్టేషన్‌లో 6 గంటలకు అందుబాటులో ఉంటుందన్నారు. మంగళగిరి పానకాలస్వామిగుడి, పెద్దకాకాని మల్లికార్జున స్వామి దేవస్థానం, అమరావతి అమరలింగేశ్వర స్వామి దేవస్థానం, వెంకటపాలెం వెంకటేశ్వరస్వామి ఆలయం, పెనుమాక మహాదివ్యక్షేత్రంతో పాటు ఉండవల్లి బౌద్ధ గుహలు సందర్శించి.. మళ్లీ అదే రోజు సాయంత్రం 6 గంటలకు విజయవాడకు బస్సు వస్తుందన్నారు. టికెట్ ధర రూ.600, 73829 00337 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

శిథిలావస్థలో చెన్నకేశవస్వామి దేవస్థానం

పాతపాడు గ్రామంలోని శ్రీ చెన్నకేశవ స్వామి దేవస్థానం శిథిలావస్థకు చేరుకుంది. గ్రామంతో పాటు విలేజి కంద్రిక వాసులు నిత్యం పూజలు చేస్తూ ఆరాధ్య దైవంగా స్వామి వారిని కొలుస్తారు. ఆలయ ముఖ మండపం శ్లాబ్ పెచ్చులూడి కూలిపోవడానికి సిద్ధంగా ఉంది. శ్లాబ్ నిర్మాణం కోసం ఉపయోగించిన ఫిల్లర్ల ఇనుప రాడ్లు తుప్పు పట్టి కనిపిస్తున్నాయి. దీంతో భక్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆలయ కమిటీ సభ్యులు చొరవ తీసుకొని దేవస్థానం పునః నిర్మించాలని భక్తులు కోరుతున్నారు.

– విజయవాడరూరల్



పాతపాడు గ్రామంలోని శ్రీచెన్నకేశవస్వామి దేవస్థానం



ఆలయంలో ఊడి పడుతున్న శ్లాబ్ పెచ్చులు

పశుపోషణలో మేలైన యాజమాన్య పద్ధతులు

కంకిపాడు: పాడి రైతులు పశుపోషణలో జాగ్రత్తలు తీసుకోవాలని పశుసంవర్ధకశాఖ సంచాలకులు డాక్టర్ టి.దామోదరనాయుడు అన్నారు. పశుగ్రాస వారోత్సవాల ముగింపు కార్యక్రమం కోలవెన్ను గ్రామంలో సోమవారం నిర్వహించారు. గ్రామానికి చెందిన బొబ్బా శ్రీనివాసరావు, జాస్తి కిశోర్ రూ 2.25 లక్షలు లింగ నిర్ధారణ పరీక్షల నిమిత్తం వితరణ అందజేశారు. డాక్టర్ దామోదరనాయుడు మాట్లాడుతూ ఈ మొత్తంతో గ్రామంలోని పశువులకు లింగ నిర్ధారణ, చికిత్సలకు వినియోగిస్తామన్నారు. పీ 4 కార్యక్రమంపై అవగాహన కల్పించుకుని, దాతలు ముందుకు రావాలని కోరారు. ఈ సందర్భంగా పలువురు రైతులకు పశుగ్రాస విత్తనాలను పంపిణీ చేశారు. సర్పంచ్ సురేష్, ఎంపీటీసీ ఉమాదేవి, జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి డాక్టర్ చిన్న నరసింహులు, జిల్లా పశుగణాభివృద్ధి అధికారి డాక్టర్ కె.శ్రీనివాసరావు, మండల వైద్యాధికారి డాక్టర్ జి.రవికుమార్, కోలవెన్ను పశువైద్యాధికారి జె.నరసింహారావు పాల్గొన్నారు.



పశుగ్రాసం విత్తనాలను అందజేస్తున్న దామోదరనాయుడు

133 కేవీ సబ్‌స్టేషన్ నిర్మాణం ప్రారంభించాలి

ఉయ్యూరు: ఉయ్యూరులో 133 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణం చేయాలని యూఎఫ్ ఆర్టీఐ రాష్ట్ర కో కన్వీనర్ జంపాన శ్రీనివాసగౌడ్ కోరారు. ఉయ్యూరు పట్టణంలోని సమస్యలు, విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణం, జాతీయ రహదారి నిర్వహణ లోపాలపై యూఎఫ్ ఆర్టీఐ ప్రతినిధులు శ్రీనివాసగౌడ్, బేతపూడి జోగేశ్వరరావు, భైవరపు దుర్గాప్రసాద్, బొల్లా శివపార్వతి సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జిల్లా కలెక్టర్ బాలాజీని కలిసి ఫిర్యాదు చేశారు. శ్రీనివాసగౌడ్ మాట్లాడుతూ.. గత ప్రభుత్వం 2022–23లో ఉయ్యూరులో విద్యుత్ సమస్యల పరిష్కారానికి 133 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌ను మంజూరు చేసిందన్నారు. నిర్మాణానికి అవసరమైన నిధులు విడుదల చేసిందన్నారు. కూటమి ప్రభుత్వం సబ్‌స్టేషన్ నిర్మాణ పనులు చేపట్టి ప్రజల విద్యుత్ సమస్యలు పరిష్కరించాలని కోరారు. జాతీయ రహదారి నిర్వహణలో లోపాలను సరిదిద్దకపోవటంతో ప్రజలు ప్రమాదాల బారిన పడుతున్నారన్నారు. విజయవాడ నుంచి మచిలీపట్నం వరకూ సర్వీసురోడ్లు అస్తవ్యస్తంగా ఉన్నాయన్నారు. వీధి దీపాల నిర్వహణ సరిగ్గా లేదన్నారు. సంబంధిత శాఖల అధికారులను సమస్యలు పరిష్కరించాల్సిందిగా కలెక్టర్ ఆదేశించారని చెప్పారు.



కలెక్టర్ బాలాజీకి విద్యుత్ సమస్యలపై ఫిర్యాదు చేస్తున్న శ్రీనివాసగౌడ్

ఇళ్ల స్థలాలకు దరఖాస్తుల అందజేత

నున్న(విజయవాడరూరల్): నున్న గ్రామంలో ఇళ్ల స్థలాల కోసం పేదలు సోమవారం దరఖాస్తు చేసుకున్నారు. గ్రామ పంచాయతీ చాటింపు ద్వారా ఇళ్ల స్థలాలకు దరఖాస్తు చేసుకోవచ్చునని తెలియజేయడంతో పెద్ద సంఖ్యలో క్యూ కట్టి దరఖాస్తు చేసుకున్నారు. సచివాలయంలో డిజిటల్ అసిస్టెంట్లు వచ్చిన దరఖాస్తులను ఆఫ్‌లైన్ ద్వారా నమోదు చేస్తున్నారు. మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో ఇళ్ల స్థలాలకు దరఖాస్తు చేసుకోవచ్చునని తహసీల్దార్ బి.సుగుణ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ నిబంధనల మేరకు దరఖాస్తు చేసుకున్న వారి వివరాలను గ్రామాల వారీగా నమోదు చేస్తారు. మండలంలోని అన్ని గ్రామ సచివాలయాల సిబ్బంది దరఖాస్తులను త్వరగా ఆన్‌లైన్ చేయాలని సూచించారు.



చికిత్స పొందుతూ వృద్ధురాలి మృతి

పెనమలూరు: పెనమలూరులో వృద్ధురాలు ప్రమాదవశాత్తూ కాలిన గాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటనపై పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ వెంకటరమణ తెలిపిన వివరాల ప్రకారం పెనమలూరు పెద్దగుడి వద్ద ఉంటున్న కనకదుర్గ(70) ఒంటరిగా ఉంటుంది. ఆమె భర్త మూడేళ్ల క్రితం మృతి చెందాడు. ఆమె ఈ నెల 6వ తేదీన ఏకాదశి పండుగ సందర్భంగా దీపారాధన చేస్తుండగా ప్రమాదవశాత్తూ ఆమె చీరకు దీపారాధన మంట అంటుకుని గాయపడింది. ఆమెను విజయవాడలో ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్సకు చేర్చారు. చికిత్స పొందుతున్న ఆమె ఆదివారం మృతి చెందింది. ఈ ఘటన మృతురాలి సోదరుడు వీరాంజనేయులు ఇచ్చిన ఫిర్యాదుపై పోలీసులు కేసు నమోదు చేశారు.